క్లుప్తంగా

నూతన ఆవిష్కరణలకు నాంది పలకండి

ఎంఈవో–2 జయంతిబాబు



తెనాలిఅర్బన్: విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలను మండల విద్యాధికారి-2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. రోబో వింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ రోబోటిక్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన హ్యూమనైడ్ రోబోట్, ఏఐ ప్రోగ్రామింగ్, చాట్ జిపిటి ప్రోగ్రామింగ్, హోమ్ ఆటోమిషన్, డ్రోన్ వంటి పరికరాలు పనిచేసే తీరును విద్యార్థులు వివరించారు. స్కూల్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ తమ పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోబోటిక్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు వి.నాగ వెంకట సాయిరాం, షేక్ సాజీద్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు



తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు గురువారంతో ముగిశాయి. వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, రోహిత్ వర్మ, వీరవల్లి మురళి, ఈదర వెంకట పూర్ణచంద్, గుమ్మడి రమేష్, కె.నాగభూషణం, కుర్రా శ్రీనివాసరావు, సాంబశివరావు, పోతురాజు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన పంట కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పినపాడులోని పంటకాల్వను గురువారం పరిశీలించారు. వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం 21, 26, 27, 28 వార్డుల్లో ఆమె పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పర్యటనలలో నా దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జాతీయ డాడ్జిబాల్ పోటీలకు 'శ్రీరామ' విద్యార్థులు



తెనాలి: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో శుక్రవారం నుంచి ఏడో తేదీవరకు జరగనున్న 17వ సీనియర్ జాతీయ డాడ్జిబాల్ పోటీలకు చిలుమూరులోని శ్రీరామా రూరల్ విద్యాసంస్థలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైనవారిలో ఎన్.ధర్మతేజ, పి.హేమప్రకాష్, ఎం.ఈశ్వర మణికంఠ, ఎ.చైతన్య, కె.దేవసింహ ఉన్నారని శ్రీరామ విద్యాసంస్థల డైరెక్టర్ కొలసాని తులసీవిష్ణుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 19 రాష్ట్రాలకు చెందిన జట్లు పోటీపడనున్న జాతీయ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తమ విద్యార్థులు అయిదుగురు ఎంపికవటంపై శ్రీరామా ప్రిన్సిపాల్ ఉమారాణి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. క్రీడాకారులను అభినందించారు.

రెండు ఆటోలు ఢీ కొని మహిళకు గాయాలు

వేమూరు: రెండు ఆటోలు ఢీ కొనడంతో మహిళకు స్వల్ప గాయాలైన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. వేమూరు నుంచి ఆటోలో మహిళ తెనాలి బయలు దేరింది. వేమూరు గ్యాస్ గోడౌన్ నుంచి మద్యం తాగి ఉన్న మరో ఆటో డ్రైవర్ వేమూరు వెళుతున్నాడు. సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో తెనాలి వెళుతున్న ఆటోను ఢీ కొట్టడం జరిగింది. ఆటో బోల్తా పడటంతో ఆటోలో ఉన్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితు వైద్యశాలకు స్థానికులు తీసుకెళ్లారు.

వైద్యశాల సమస్యలకు పరిష్కారం

- తెనాలి జిల్లా ఆస్పత్రిలో తొలగుతున్న సమస్యలు
- రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు
- నెలాఖరులో పూర్తి చేసేందుకు చర్యలు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో నెలకొన్న సమస్యలు ఒక్కొక్కటిగా తొలగుతున్నాయి. రోగులకు మరిన్ని వసతులు కల్పించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా రూ.80 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలను నిర్మించి సుమారు 25 సంవత్సరాలు అయింది. దీనిలో 200 మంది ఇన్‌పేషెంట్‌లు ఉండేందుకు అవసరమైన వార్డులు, వారికి శస్త్ర చికిత్సలు చేసేందుకు అవసరమైన అపరేషన్ థియేటర్‌లు, ఓపీ గదులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

దానిని నిర్మించి 25 సంవత్సరాలు కావటంతో అనేక వార్డులలో ఫ్లోరింగ్ దెబ్బతినటం... శ్లాబ్‌లు పెచ్చులూడిపోవటం వంటివి జరిగాయి. అలాగే వార్డులలో అంతర్గతంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు దెబ్బనటం జరిగింది. వార్డులలోని మరుగుదొడ్లలు పాడైపోయాయి. వీటిని బాగు చేయించాలని స్థానిక అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులను కోరారు. ఎట్టకేలకు ఉన్నతాధికారులు రూ.80 లక్షల నిధులను విడుదల చేసి పను లు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

వార్డులు ఆధునీకరణ

జిల్లా వైద్యశాలలో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల కావటంతో ఇంజినీరింగ్ అధికారులు జనవరిలో పనులు ప్రారంభించారు. ముందుగా ఎంఎం, ఎఫ్ఎం వార్డులలోని రోగులను



నూతన అపరేషన్ థియేటర్



ఎఫ్ఎం వార్డులో నిర్మిస్తున్న ఫ్లోరింగ్

ఇతర వార్డులకు పంపారు. అనంతరం దాని ఫ్లోరింగ్‌ను పూర్తిగా తొలగించి నూతన ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయు, హెచ్ డీయు వార్డులలో దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను పూర్తిగా తొలగించి నూతన ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యశాల లో బయట దెబ్బతిన్న గోడలకు మరమ్మతు చేశారు. అలాగే ఎంఎం, ఎఫ్ఎం వార్డులలో నూతన అంతర్గత మురుగు నీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. బయట 108 వాహనాల పార్కింగ్ కోసం నూతన ప్లాట్‌ఫాంను నిర్మించారు. గతంలో అగ్ని ప్రమాదానికి గురైన గదినీ ఆధునీకరిస్తున్నారు. టెర్రస్‌లో వాటర్ ప్రూఫ్ కోటింగ్, ఎలక్ట్రీకల్ పనులు చేస్తున్నారు.

నూతన అపరేషన్ థియేటర్

జిల్లా వైద్యశాలలో ఇప్పటికే ఆర్థో, ఈఎన్‌టీ, అప్తామాలజీ, జనరల్ సర్జరీలకు సంబంధించిన నాలుగు థియేటర్‌లు ఉన్నాయి. ఆదే అవరణలో ఉన్న రికవరి వార్డును అపరేషన్ థియేటర్‌గా మార్చుతున్నారు. దీనిలో ఎపాక్సి ఫ్లోరింగ్, సైంటిఫిక్ డోరు, పీయు పెయింటింగ్ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనిని ఆర్థోపెడిక్ విభాగ సర్జరీల కోసం ఉపయోగించే అవకాశం ఉంది.

చేసింది కొంత... చేయాల్సిందే కొండంత!

వైద్యశాలలో కొన్ని అభివృద్ధి పనులు చేస్తుండటం శుభపరిణామమే. అయినప్పటికీ ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. డివిజన్‌లోనే తెనాలి వైద్యశాల పెద్దది కావటంతో ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొందేవారి సంఖ్య కూడా ప్రతిరోజు ఎక్కువగా ఉంటుంది. అయితే క్యాజువాలిటీ చిన్నదిగా ఉండటం వల్ల ఎక్కువ సార్లు అది సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అలాగే జిల్లా వైద్యశాలలోని వార్డులలో రోగుల ఎక్కువగా చేరుతుండటం వల్ల కొన్ని సార్లు బెడ్‌లు చాలక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆస్పత్రి ఆవరణలోని ఖాళీ ప్రాంతాన్ని వార్డులుగా మార్పుచేస్తే రోగులకు మేలు జరిగే అవకాశం ఉంది. అలాగే ఇంకా క్యాజువాలిటీ వార్డు, ఎంఎస్, ఎఫ్ఎం, అప్తామాలజీ వంటి వార్డులను ఆధునీకరించటంతో పాటు వాటిలోని మరుగుదొడ్లు బాగు చేయాలి. అలాగే వైద్యశాలలో ఎక్కువ భాగం ఫ్లోరింగ్ దెబ్బతింది. దీనిని బాగు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా పాలకులు, అధికారులు అడుగులు వేయాలని రోగులు కోరుతున్నారు.

నెలాఖరులో పనులు పూర్తి



తెనాలి జిల్లా వైద్యశాలలో రూ.80లక్షలతో అనేక అభివృద్ధి పనులు చేయిస్తున్నాం. వార్డుల అధునీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈనెల చివరిలోపు పనులు పూర్తి చేసి అధునీకరించిన వార్డులు, అపరేషన్ థియేటర్‌ను అస్పత్రి అధికారులకు అప్పగిస్తాం.

–పి.వీరస్వామికృష్ణ, ఏఈ, ఏపీఎంఎస్ఐడీసీ, తెనాలి.

చట్ట సవరణతో పెన్షనర్లకు తీవ్ర నష్టం

తెనాలిలో నిరసన తెలియజేస్తున్న విశ్రాంత పోస్టల్ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన కేంద్ర పెన్షన్ చట్ట సవరణ వలన ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఉమా మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద గురువారం కొద్దిసేపు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం చేసిన చట్ట సవరణను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. సంఘ తెనాలి డివిజన్ కార్యాలయంలో ఎల్.ప్రసాద్‌రావు మాట్లాడుతూ కేంద్రం చేసిన చట్ట సవరణ వలన వేతనాలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులు దీని వలన తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వి.వి.సత్యనారాయణ, టి.పోతురాజు, షేక్ నురూద్దీన్, తపాల పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు ఐ.కోటేశ్వరరావు, కె.లక్ష్మణరావు, ఎం.తిరుమలరావు, గోవిందనాథ్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న విశ్రాంత పోస్టల్ ఉద్యోగులు

కోలాహలంగా ఎడ్ల బలప్రదర్శన

తెనాలిరూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి. రోజురోజుకూ ప్రేక్షకుల సంఖ్య పెరుగుతోంది. సబ్ జూనియర్స్ పోటీలు బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించి ముగించారు. ఈ విభాగంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4200 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి. బాపట్ల జిల్లా నగరం మండలం మంతెనవారిపాలెంకు చెందిన మేక ప్రతీక్ జత(3900 అడుగులు) రెండో బహుమతిని, కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరుకు చెందిన గరికపాటి శ్రీధర్ జత (3311.05 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. ఆరో రోజుకు చేరిన పోటీల్లో గురువారం జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. మొత్తం తొమ్మిది జతలు పోటీలకు రాగా రాత్రి పొద్దుపోయే వరకు పోటీలు జరిగాయి. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అతిథులుగా హాజరయ్యారు. సబ్ జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు. సూరపనేని రాధాకృష్ణమూర్తి రిఫరీగా వ్యవహరించారు.



ప్రథమ విజేత ఎడ్ల జత యజమానికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యేలు

నేడు సీనియర్ విభాగం పోటీలు

ఎడ్ల బలప్రదర్శనలో భాగంగా సీనియర్ విభాగంలో పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ విభాగానికి ఇప్పటికే 11 జతల ఎడ్లు రాగా డ్రా తీసి ఉదయం కొన్ని తిరిగి సాయంత్రం కొన్ని ఎడ్లకు పోటీసుల నిర్వహిచనున్నట్లు రిఫరీ తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి

తెనాలి: హిందూ చైతన్య వేదిక, శివాజీ స్మారక సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తెనాలిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హిందూ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ భారత దేశంలో ముస్లిం ముష్కరులు, విదేశీ దాడులనుంచి ప్రజలను రక్షించారని చెప్పారు. హిందూ పదపాదశాహి అని బిరుదుకు అంకితమై హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారని వివరించారు. యువతరం ఆయన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ రాయగడ కోటలో 1680 ఏప్రిల్ 3న మృతిచెందినట్టు తెలిపారు. ప్రతి హిందువు శివాజీ మహరాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్, ఆర్ఎస్ఎస్ స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ అవ్వారు శ్రీనివాస్, శివాజీ స్మారక సమితి నాయకులు తరుణ్ గోపి. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఉల్లంగంటి శ్రీనివాస్, తాడేపల్లి మూర్తి, దాసరి నాగార్జున, హరి వెంకట, మహిళా నాయకులు కారంపూడి రమాదేవి, శారద, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పొత్తూరి అది శేషు, హనుమంతు ప్రసాద్, ఛత్రగడ్డ రమణ, బీజేపీ నాయకులు కటారి వాసుదేవనాయుడు, అడపా సంపత్, కుషాల్ రాజ్, రామిశెట్టి గోపి, కోవూరు శ్రీనివాస్, వెంకటేశ్వరావు, జనసేన నాయకుడు నన్నపనేని రాంబాబు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నినాదాలు చేస్తున్న నేతలు

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ

రేపల్లె రూరల్: పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం నిర్వహించిన నూతన వస్త్రాలు అందజేత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు విధులపట్ల నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా పనులు నిర్వర్తిస్తూ స్వచ్ఛ రేపల్లె సాధనకు తమ వంతు సేవలు అందించాలని కోరారు. నూతన వస్త్రాలే కాకుండా ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఇప్పటికే అన్ని రకాల పనిముట్లను అందించటం జరిగిందని, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యాక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

'అమరావతి చిత్రకళావీధి'కి తెనాలి శిల్పులు

తెనాలి: 'అమరావతి చిత్రకళా వీధి' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4 నుంచి రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న భారీ శిల్ప, చిత్రకళా ప్రదర్శనలో స్థానిక కాటూరి ఆర్ట్ గ్యాలరీ శిల్పులకు ఆహ్వానం లభించింది. ఈ ప్రదర్శనలో 500కు పైగా ఏర్పాటు చేస్తున్న ఆర్ట్ ఎగ్జిబిషన్ స్టాళ్లలో కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు తమ శిల్పాలను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి నుంచి ఈమేరకు ఆహ్వానం లభించిందని చెప్పారు. ప్రదర్శనలో చేర్చనున్న విగ్రహాలను గురువారం కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఎస్పీ సత్యనారాయణ మూర్తి ఆయా విగ్రహాలను తిలకించారు. శిల్పకళలో తెనాలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లటంలో కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారిని శాలువాలతో సత్కరించారు.



ప్రదర్శన విగ్రహాలను తిలకిస్తున్న అతిథులు

'దాసకుటి' ఆరో పీఠాధిపతిగా సీతారామశర్మ

- భక్తుల సమక్షంలో ఘనంగా జరిగిన పట్టాభిషేకం
- శ్రీగంభీరానంద భారతి స్వామి అనుగ్రహణ భాషణ

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసుస్వామి పరంపర పీఠం శ్రీకోదండరామ సేవక ధర్మసమాజం (దాసకుటి) గురుపాదుకా పీఠాధిపత్య మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. దాసకుటి అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఉలిచి సీతారామ శర్మకు ఆరో పీఠాధిపతిగా పట్టాభిషేకం చేశారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సీతారామశర్మను అభిషేకించారు. అనంతరం సుదర్శన హోమం, లక్ష్మీ నరసింహస్వామి హోమం, విష్ణు సహస్రనామ హోమం నిర్వహించి, పూర్ణాహుతిని చేశారు. గుంటూరులోని శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష పీఠాధిపతి శ్రీగంభీరానంద భారతిస్వామి హాజరై అనుగ్రహభాషణ చేశారు. పీఠాధిపతిగా పట్టాభిషిక్తుడైన శ్రీమాన్ ఉలిచి సీతారామశర్మ నామధేయాన్ని సీతా రామదాసుగా మార్చారు. నడిగడ్డపాలెం వాసుదాసాశ్రమానికి చెందిన శ్రీమాన్ బదరీనాథ్ ఆధ్వర్యంలో ఈ క్రతువును నిర్వహించారు. పూజలు, హోమాలతోపాటు మహిళల కోలాటం ఈ వేడుకలో మరో ప్రత్యేక ఆకర్షణ. అతిథులుగా చిలకపాటి విజయరాఘవాచార్య స్వామి (హైదరాబాద్), వనం జ్వాలా నరసింహారావు, ఆత్కూరి శ్రీమన్నారాయణ, కేశవదాసు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ చేశారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 9వ తేదీవరకు సీతారామ స్వామికి 68వ లక్ష మల్లెల పూజ రామాయణ యజ్ఞం జరుగుతుందని తెలియజేశారు.



పీఠాధిపతిగా అభిషిక్తుడైన సీతారామశర్మను సత్కరిస్తున్న భక్తులు

'ఆంధ్రవాల్మీకి' పరంపర పీఠం 'దాసకుటి'

ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసుస్వామి వాల్మీకి రామాయణంలోని 24 వేల శ్లోకాలకు 24 వేల పద్యాలు, అర్థతాత్పర్యాలు రచించి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామికి సమర్పించారు. 1920 నుంచి 22 వరకు టెంకాయ చిప్పతో భిక్షాటన చేసి ఒంటిమిట్ట దేవాలయాన్ని పునరుద్ధరించిన అపర భద్రాద్రి రామదాసుగా పేరు పొందారు. తర్వాత స్వామి అక్కడి నుంచి, తెనాలి సమీపంలోని చుండూరు మండల గ్రామం నడిగడ్డపాలెంలో వాసుదాసస్వామి ఆశ్రమం ఏర్పాటు చేశారు. ఆయన తదనంతరం శ్రీదాసశేషస్వామి అధిపతిగా ఉన్నారు. కొంతకాలం తర్వాత ఆయన అంగలకుదురు వచ్చేశారు. ఇక్కడే శ్రీకోదండరామ సేవక ధర్మసమాజం (దాసకుటి) ఏర్పాటు చేసుకున్నారు.

1958లో మహాసామ్రాజ పట్టాభిషేకాన్ని ఘనంగా జరిపారు. తదుపరి తృతీయ గురువైన శ్రీశేషదాస స్వామి 1981లో సీత యజ్ఞం చేసి, రెండు లక్షల మందికి అన్నదానం చేశారు. పంచమ గురువు శ్రీరామానుజదాస స్వామి ఆధ్వర్యంలో 2008 సంవత్సరంలో సుందరకాండ యజ్ఞం, 2018లో రామాయణ యజ్ఞం చేశారు. ఆయన తదనంతరం గత అయిదేళ్లుగా ఉలిచి సీతారామ శర్మ (పట్టాభి) అధ్యక్షులుగా దాసకుటి నడుస్తోంది. అయోధ్యలో బాలరాముని పాదాల కింద అమర్చిన యంత్రము చీరాల చిదంబర శాస్త్రిచే తొమ్మిదేళ్లు ఆరు కోట్ల మంత్రముతో పూజించిన విషయం తెలిసిందే. అయోధ్యకు తరలించేటప్పుడు సీతారామశర్మ కోరికపై అంగలకుదురులోని దాసకుటికి ఆ యంత్రం తీసుకొచ్చారు. ఇక్కడ భక్తులచే పూజలందుకున్నాక, అయోధ్యకు చేరుకుంది.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి
- స్వామి వారిని దర్శనానికి పోటెత్తిన భక్తులు

కర్లపాలెం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనా తిరునాళ్ల మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్లలో స్వామివారి ఆలయ జెండాతో పాటు గ్రామంలో భక్తుల మొక్కుబడుల జెండాలు కలిపి సుమారు 20 ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లపై ఉంచి మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి జెండాలకు మహిళలు హారతులిచ్చి పూజలు చేసి టెంకాయలు సమర్పించారు. గ్రామోత్సవంలో స్వామి వారి జెండాలు పాత నందాయపాలెం డొంక మీదుగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్ వరకు అక్కడి నుంచి తిరిగి ఊరేగింపుగా స్వామి వారి గుడి వద్దకు తీసుకువచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి రావిచెట్టుకు జెండాలను ప్రతిష్ఠించారు. తిరునాళ్లలో భాగంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించటంతో పాటు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేసి రావి చెట్టు వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మురళి కోలాటం, భజన, బ్రహ్మంగారి చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎలాంటి అల్లర్లు జరగకుండా స్థానిక ఎస్ఐ రవీంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



గ్రామోత్సవానికి తరలివచ్చిన బ్రహ్మంగారి మొక్కుబడి జెండాలు

వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన అవసరం



తెనాలిటౌన్: విద్యార్థులు వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలని కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు సూచించారు. గురువారం రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఈఎండీపీ ప్రాజెక్టులో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. 9వతరగతి విద్యార్థులు జంగం దర్శిని ప్రియా, నలుకుర్తి అలేఖ్య, షేక్ కమర్ జహాలు ఏకో ఫ్రెండ్లీ హెర్బల్ అండ్ ఆర్గానిక్ షాపు అనే ప్రాజెక్టును జిల్లా స్థాయిలో ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ మత్తె అన్నారావును అభినందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేప కషాయం తయారీపై రైతులకు అవగాహన



తెనాలిటౌన్: వేప కషాయం తయారీ, వినియోగంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.ఉషారాణి సూచించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో గురువారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం లామ్ గుంటూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వేప కషాయం తయారీ, పంటలో వినియోగం, ఉపయోగాలను వివరించి చార్ట్ రూపంలో చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, రైతులు కళ్యాణం మల్లిఖార్జునరావు, కళ్యాణం వెంకటరామయ్య, వీఏఏ శివసాయితేజ, మౌనిక, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలిలో ముగిసిన రుణమేళా



తెనాలిటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బీసీ కార్పోరేషన్ రుణమేళా గురువారంతో ముగిసింది. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు రుణమేళాకు హాజరయ్యారు. అభ్యర్థుల ధృవపత్రాలను, సివిల్ స్కోర్‌ను బ్యాంకు అధికారులు పరిశీలించారు. మండల పరిషత్ అభివృద్ధి అదికారి అత్తోట దీప్తి కార్యాలయంలో నిర్వహిస్తున్న రుణమేళా పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో ఆన్‌లైన్‌లో 835 మంది అభ్యర్థులు బీసీ, ఓసీ కార్పోరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం 300 మంది అభ్యర్థులు హాజరుకాగా, గురువారం 350 మంది హాజరైనట్లు తెలియజేశారు. వీరిలో అర్హత కలిగిన అభ్యర్థులకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ



తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకాకుమాను వెంకటసుబ్బయ్య వందేళ్ల క్రితం బాటసారుల కోసం స్థాపించిన సత్రంలో గురువారం ఆయన జయంతిని నిర్వహించారు. పేదలకు అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేశారు. తిరుపతి మల్టీజోన్-2 ప్రాంతీయ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ఈ కార్యక్రమాన్ని జరిపారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కె.గిరిధర్, కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి, దేవదాయ సిబ్బంది సుబ్బారావు, లక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.